


కానుకల లెక్కింపు

గుడ్లవల్లేరు: శ్రీకొండలమ్మ ఆలయ హుండీల్లో కానుకలను సోమవారం లెక్కించారు. 62 రోజులకు రూ.27,95,004 , 9 గ్రాముల బంగారం, 290 గ్రాముల వెండి లభించాయి.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 5,706 క్యూసెక్కులు విడుదల చేశారు.

సబ్‌జైలు పరిశీలన



తెనాలిరూరల్: తెనాలి సబ్‌జైలును రెండో అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ జె. శ్రీసీత సోమవారం సాయంత్రం పరిశీలించారు. అనంతరం మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఖైదీలతో మాట్లాడారు.

న్యూస్‌రీల్

వైభవంగా నృసింహుని పవిత్రోత్సవాలు



మంగళగిరి: నగరంలోని శ్రీలక్ష్మీనృసింహ స్వామి పవిత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం ఉదయం అగ్నిమథనం, పంచగవ్యారాధన, పంచగవ్య ప్రాశన, పంచాగ్ని ప్రణయనము, ఉక్తహోమాలు నిర్వహించి పవిత్రాలతో గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం నిత్యహోమం, దిక్పూక్తహోమం, నవగ్రహహోమం, ప్రసాద గోష్ఠి, న్యాసం నిర్వహించి రాత్రి 8 గంటలకు పవిత్రముల శయనాధి వాసము నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ ఎ.రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. అర్చకులు పూజలు నిర్వహించారు.

ముగిసిన ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరుగుతున్న ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలు సోమవారంతో ముగిశాయి. గత నెల 26న గుంటూరు రేంజ్ పరిధిలో ఎస్‌ఐ అభ్యర్థులకు శారీరక పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. మధ్యలో వర్షాల వల్ల వాయిదా పడిన పరీక్షలను తర్వాతి తేదీల్లో నిర్వహించారు. సోమవారం చివరి రోజున పరీక్షల నిర్వహణను గుంటూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు పర్యవేక్షించారు. తొలుత అభ్యర్థుల ఒరిజినల్/నకలు ధ్రువీకరణ పత్రాలను పోలీస్ అధికారులు, సిబ్బంది నిశితంగా పరిశీలించారు. అనంతరం బయోమెట్రిక్, ఎత్తు, ఛాతీ కొలతలను నమోదు చేసుకున్నారు. 100, 1,600 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. 81 మంది పురుష అభ్యర్థులు పోటీలో పాల్గొనగా, 39 మంది ఉత్తీర్ణత సాధించారు. గుంటూరు ఏఎస్పీలు (పరిపాలన) కె.సుప్రజ, డీఎస్పీలు శ్రీనివాసరావు (డీసీఆర్‌బీ), చంద్రశేఖర్ (ఏఆర్), విజయశేఖర్ (ఎస్సీ/ఎస్టీ) ఐజీ కార్యాలయపు సీఐ సుధాకర్, ఆర్‌ఐలు, సీఐలు, ఎస్‌ఐలు, మినిస్టీయల్ సిబ్బంది పాల్గొన్నారు.

నాలుగు రోజుల్లో రిటైనింగ్ వాల్ డిజైన్లు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొండ చరియలు విరిగి పడకుండా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి అవసరమైన డిజైన్లను నాలుగు రోజుల్లో సిద్ధం చేస్తామని టెక్నికల్ కమిటీ బాధ్యుడు ఆర్.కొండలరావు తెలిపారు. దుర్గాఘాట్ ఎదుట ఇటీవల కొండ చరియలు విరిగి పడిన ప్రాంతాన్ని టెక్నికల్ కమిటీ సోమవారం పరిశీలించింది. కమిటీ సభ్యులు ఆర్.కొండలరావు, సిద్దార్థ ఇంజినీరింగ్ కాలేజీ సివిల్ డిపార్టుమెంట్ డీన్ ప్రొఫెసర్ పాండురంగారావు, ప్రొఫెసర్ రమేష్‌కుమార్, త్రిమూర్తి రాజుతో పాటు దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ భ్రమరాంబ ఘాట్‌రోడ్డు వద్ద కొండను పరిశీలించారు. ఘాట్‌రోడ్డు మీదగా తాడు సాయంతో కొండ చరియలు విరిగి పడిన ప్రదేశానికి చేరుకుని అక్కడి పరిస్థితిని అంచనావేశారు. కొండ చరియలు విరిగి పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై దుర్గగుడి ఇంజినీరింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. రాళ్లు, కొండ చరియలు విరిగి పడకుండా శాశ్వత ప్రాతిపదికన చేపట్టాల్సిన పనులను వివరించారు. నాలుగు రోజుల్లో అవసరమైన డిజైన్లు సిద్ధం చేసి దేవస్థానానికి అందజేస్తామన్నారు. దుర్గగుడి ఈఈ కె.వి.ఎస్.కోటేశ్వరరావు, లింగం రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

యార్డుకు 31,315 బస్తాల మిర్చి రాక

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 31,315 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 30,015 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,900 వరకు పలికింది. యార్డులో ఇంకా 10,152 బస్తాల మిర్చి నిల్వ ఉంది.

సేద్య పవనాలు

సు'ఫలం'.. సుమధురం



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు పేరు షేక్ సాంబశివరావు. ఊరు నరసరావుపేట మండలం అర్వపల్లి. ఈయనకు ఉన్న 2.20 ఎకరాల పొలంలో గతంలో వరి, కంది, పత్తి పంటలను సాగుచేసేవారు. తీవ్ర నష్టాలు రావడంతో ఉద్యాన పంటల వైపు మళ్లాలని నిర్ణయించుకున్నారు. స్థానిక ఉద్యానశాఖ అధికారుల సహకారంతో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేశారు. ప్రస్తుతం ఎకరాకు ఏటా సుమారు రూ.10 లక్షల వరకు ఆర్జిస్తున్నారు. దీంతో ఉద్యాన శాఖ ఇస్తున్న రాయితీతో మరో 2 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగుకు శ్రీకారం చుట్టారు.



డ్రాగన్ 'ఫ్రూట్‌ఫుల్' : రైతు షేక్ సాంబశివరావు సాగు చేసిన డ్రాగన్ ఫ్రూట్ తోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ కమిషనర్ డాక్టర్ ఎస్‌ఎస్ శ్రీధర్(ఫైల్)

ఉద్యాన పంటల ఖిల్లా 'పల్నాడు'

- 63,799 హెక్టార్లలో సాగు
- ఏటా 3,93,502 మెట్రిక్ టన్నుల దిగుబడి
- ఖర్జూర, యాపిల్ బేర్, డ్రాగన్‌ఫ్రూట్ సేద్యానికీ శ్రీకారం
- ఇప్పటికే మిర్చి పంటకు కేరాఫ్ అడ్రస్‌గా జిల్లా
- ప్రోత్సాహకాలు అందిస్తున్న ప్రభుత్వం



యాపిల్ కు'భేర్' : అచ్చంపేట మండలం గ్రంథసిరిలో రైతు రాంబాబు సాగుచేస్తున్న యాపిల్ బేర్ పంట

జిల్లాలో ఉద్యానపంటల విస్తీర్ణం ఇలా..

పంట	సాగు విస్తీర్ణం (హెక్టార్లలో)	దిగుబడి (మెట్రిక్ టన్నుల్లో)
సుగంధ ద్రవ్యాలు	59,374.30	2,68,655.00
పండ్లు	2,874.00	89,825.45
కూరగాయలు	1,379.48	33,219.18
పూలు	171.22	1,802.37
మొత్తం	63,799	3,93,502

సాక్షి, నరసరావుపేట: పల్నాడులో వేలాది మంది రైతులు ఉద్యాన పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. కరోనా తర్వాత పండ్లు, కూరగాయల వినియోగం అమాంతం పెరిగింది. దీంతో వీటి సాగుకు రైతులు ఆసక్తి కనబరిచారు. ధరలు నిలకడగా ఉండడంతో ఆశించిన స్థాయిలో ఆదాయమూ లభిస్తోంది.

3.93 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి

జిల్లాలో మొత్తం 63,799 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. 2022–23 ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 3,93,502 మెట్రిక్ టన్నుల కూరగాయలు, పండ్లు, సుగంధ ద్రవ్యాలు, పూల ఉత్పత్తి జరిగింది. ఇందులో సింహభాగం మిర్చి పంటదే. జిల్లాలో 58,524 హెక్టార్లలో మిర్చి సాగు కాగా 2,63,358 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి వచ్చింది. ఈ ఖరీఫ్‌లోనూ మిర్చి సాధారణ సాగు లక్ష్యం 59,797 హెక్టార్లుగా అధికారులు అంచనా వేశారు. ఇక్కడ పండే మిర్చికి దేశ,విదేశాల్లో మంచి గిరాకీ ఉంది.

'ఫల'నాడుగా ఖ్యాతి

పల్నాడు జిల్లా ఫలనాడుగా మారుతోంది. కొత్తరకం ఫలాల సాగును ఇక్కడి రైతులు ప్రయోగాత్మకంగా చేపడుతున్నారు. సాధారణంగా ఖర్జూర పంటను గుజరాత్, రాజస్థాన్, తమిళనాడుల్లో సాగు చేస్తారు. పల్నాడు జిల్లాలో కూడా ఖర్జూర పంట సాగుచేయవచ్చని కారంపూడి మండలం ఒప్పిచర్లకు చెందిన బాషా నిరూపించారు. 40 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు ఉండటంతో ఇక్కడి వాతావరణం ఖర్జూర సాగుకు అనుకూలమని చూపారు.

- థాయ్‌లాండ్‌కి చెందిన యాపిల్ బేర్ పండును ఉత్తరభారత దేశంలోనే గతంలో సాగు చేసేవారు. ప్రస్తుతం అచ్చంపేట మండలం గ్రంథసిరిలో రైతు రాంబాబు నాలుగు ఎకరాల్లో సాగుచేస్తున్నాడు. యాపిల్ బేర్ పంట ఏటా అక్టోబర్ నుంచి జనవరి వరకు చేతికివస్తుంది. ఎకరానికి పది టన్నుల వరకు దిగుబడి రాగా, ఆదాయం సగటున రూ.2 లక్షల వరకూ వస్తోంది.
- పోషకాలున్న డ్రాగన్ ఫ్రూట్‌నూ ఇక్కడి రైతులు సాగు చేస్తున్నారు. మాచర్ల, పెదకూరపాడు, మాచవరం, యడ్లపాడు, నరసరావుపేట మండలాల్లో ఎక్కువగా సాగవుతోంది. ఎర్ర నేలలు, అధిక ఉష్ణోగ్రతలు ఈ పంటకు అనుకూలం. తక్కువ నీటితో సాగుచేసే ఈ పంట మొక్కలు నాటిన రెండేళ్ల తర్వాత దిగుబడి వస్తుంది.

ప్రభుత్వ ప్రోత్సాహం అమోఘం

మెట్టప్రాంతం అధికంగా ఉన్న పల్నాడు జిల్లాలో ఉద్యాన పంటల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ఏటా ఉద్యాన శాఖ ద్వారా రైతులకు అవగాహన కల్పించడంతోపాటు రాయితీ, ఇతర కార్యక్రమాల ద్వారా ఏటా సుమారు రూ.13 కోట్ల వరకూ ఖర్చు చేస్తోంది. కస్టమ్ హైరింగ్ సెంటర్ల పేరిట ట్రాక్టర్లు, స్ప్రేయర్లు, వర్ వీడర్లు పంపిణీ చేస్తోంది. వర్షాభావ పరిస్థితులు నెలకొన్నప్పుడు పంటలకు రక్షక తడులు ఇచ్చేందుకు 50 శాతం రాయితీతో ఫాంపాండ్స్ తవ్విస్తోంది. మార్కెటింగ్ సదుపాయాలూ చూపుతోంది.

లాభసాటి సేద్యమే లక్ష్యం



ఉద్యాన పంటల ద్వారా అధిక లాభాలు సిద్ధిస్తాయి. కాలానుగుణంగా వస్తున్న కొత్త వంగడాలు, రకాలను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటే సత్ఫలితాలు సాధ్యం. రైతులకు అవసరమైన సాంకేతిక సలహాలు, సూచనలతో పాటు ఉద్యాన శాఖ తరఫున రాయితీలు ఇస్తున్నాం. ఈ ప్రాంత పరిస్థితులు, మార్కెటింగ్ సదుపాయాల ఆధారంగా పంటలను సాగుచేయిస్తున్నాం. లాభసాటి సేద్యమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

– బెన్నీ, జిల్లా ఉద్యానశాఖ అధికారి, పల్నాడు

దానిమ్మతో ఏడాదికి రూ.15 లక్షల ఆదాయం



మా ప్రాంతంలో పొడి వాతావరణం, ఎర్రనేలలు కావడంతో మూడు ఎకరాల్లో దానిమ్మ పంటను సాగుచేస్తున్నా. ఈ ఏడాది జనవరిలో ఖర్చులు పోను మూడు ఎకరాలకు రూ.15 లక్షల వరకు నికర ఆదాయం లభించింది. ఉద్యాన శాఖ రాయితీతోపాటు, సాంకేతిక సలహాలు, సూచనలు అందించింది.

– పగడాల చిన్నకోటిరెడ్డి, రైతు, విఠంరాజుపల్లి, వినుకొండ మండలం

సమష్టి కృషితో ఉమ్మడి జిల్లా అభివృద్ధి

జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా



గుంటూరు ఎడ్యుకేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగుజాడల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారుల సమష్టి కృషితో పునరంకితమవుతామని జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా చెప్పారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ పాలకవర్గం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం జెడ్పీ సమావేశ మందిరంలో ద్వితీయ వార్షిక వేడుకలను జరుపుకున్నారు. జిల్లాలోని వివిధ మండలాల జెడ్పీటీసీలు హెనీ క్రిస్టినాను సత్కరించారు. ఆమె మాట్లాడుతూ దేవుని దయ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రథమ మహిళగా ఇదే వేదికపై ప్రమాణ స్వీకారం చేసిన తాను గత రెండేళ్ల కాలంలో జెడ్పీ ఆధ్వర్యంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శాయశక్తులా కృషి చేశానని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు కోట్లాది రూపాయలను వెచ్చిస్తున్నట్లు వెల్లడించారు. జెడ్పీలో సీనియర్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న ఎనిమిది మంది ఉద్యోగులకు పరిపాలనాధికారులుగా ఉద్యోగోన్నతులు కల్పించడంతోపాటు వారికి వివిధ మండల పరిషత్ కార్యాలయాల్లో పోస్టింగ్స్ ఇచ్చారు. ఉద్యోగోన్నతులు పొందిన వారిలో ఎ.రమేష్ (క్రోసూరు), ఎస్. రామకృష్ణప్రసాద్ (రాజుపాలెం), సీహెచ్ వెంకటేశ్వర్లు (మాచర్ల), ఎం.నాగచంద్రకుమారి (పిడుగురాళ్ల), జె. శర్మ (వెల్దుర్తి), టి. శ్రీనివాసరావు (మంగళగిరి), సీహెచ్ వెంకటరవి (ఈపూరు) ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త కత్తెర సురేష్‌కుమార్, జెడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు, జెడ్పీ వైస్ చైర్మన్లు శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, బత్తుల అనురాధ, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.



షూటింగ్ పోటీల్లో పాల్గొన్న సన్విత్తాషారోన్

షారోన్ D/o నరేష్

- తండ్రికి తగ్గ తనయ
- నాన్న పోలీస్.. కుమార్తె షూటర్
- ఇద్దరూ పతకాల విజేతలే
- నేషనల్ షూటింగ్ పోటీలకు కూతురి ఎంపిక

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): తండ్రి పోలీస్‌శాఖలో అత్యుత్తమ పనితీరుతో ప్రతిష్టాత్మక పతకాలు అందుకున్న అధికారి.. ఆ కుమార్తె తండ్రికి తగ్గ తనయ. షూటింగ్‌లో దిట్ట.. నాన్న స్ఫూర్తి, ప్రోత్సాహంతో ముందుకు సాగుతూ జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. తన తండ్రితోపాటు గుంటూరు కీర్తిని చాటేందుకు సిద్ధమైంది. ఎందరికో ఆదర్శంగా నిలిచిన ఈ తండ్రీకూతుళ్ల విజయగాథ..

అత్యున్నత గ్యాలంటరీ అవార్డు కైవసం

సీఐ డి.నరేష్.. ప్రస్తుతం గుంటూరు దిశ పోలీసుస్టేషన్ సీఐగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 1998లో ఎస్‌ఐగా ఉద్యోగజీవితం ప్రారంభించిన ఆయన గుంటూరు రేంజ్ పరిధిలోనే వివిధ విభాగాల్లో పని చేశారు. అనంతరం సీఐగా ఉద్యోగోన్నతి పొందారు. సుమారు ఆరున్నరేళ్లపాటు నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో పనిచేసి 2010 సంవత్సరంలో పోలీసు శాఖలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన రాష్ట్రపతి ఎంపిక చేసే గ్యాలంటరీ అవార్డును అప్పటి ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య చేతుల మీదుగా అందుకున్నారు. 2006లో రాష్ట్ర ప్రభుత్వ సేవా పతకం, 2018లో ఉత్కృష్ట సేవా పతకం, 2022లో ఉత్తమ సేవా పతకం అందుకున్నారు. విశ్రాంత డీజీపీలు పేర్వారం రాములు, స్వర్ణజిత్‌సేన్, అప్పా డైరెక్టర్ గోపినాథ్‌రెడ్డితోపాటు అనేక మంది ఉన్నతాధికారుల చేతుల మీదుగా అనేక అవార్డులను పొందారు. విధుల్లో చేరిన నాటి నుంచి ఇప్పటి వరకు కనీసం ఒక్క పనిష్‌మెంట్ కూడా లేదంటే.. ఆయన విధుల్లో ఎంత బాధ్యతగా ఉంటారో అర్థమవుతోంది.

పుత్రికోత్సాహంతో ఉప్పొంగే..

సీఐ నరేష్ కుమార్తె సన్విత్తాషారోన్. ఇంటర్మీడియెట్ పూర్తి చేశారు. ప్రస్తుతం లా చదవించేందుకు సిద్ధమవుతున్నారు. ఈమె షూటింగ్‌లోనూ దిట్ట. ఇప్పటికే అనేక పతకాలు కైవసం చేసుకున్నారు. ఇటీవల నేషనల్స్‌కు ఎంపికయ్యారు. చిన్ననాటి నుంచి కూతురు షూటింగ్‌పై ఆసక్తి కనబరచడంతో సీఐ నరేష్ ప్రోత్సహించారు. శిక్షణ ఇప్పించి మెళకువలు నేర్పించారు. రాష్ట్ర స్థాయిలో ఎయిర్ పిస్టల్ రేంజ్–10 జూనియర్, ఉమెన్ విభాగాల్లో సన్విత స్వర్ణ, వెండి పతకాలను సాధించారు. ఫైర్ ఆమ్–25 రేంజ్ విభాగంలో భూపాల్, కేరళ, ఢిల్లీలోని అత్యంత ప్రతిష్టాత్మకమైన కర్ణీసింగ్ షూటింగ్ రేంజ్, అహ్మదాబాద్, గుజరాత్ పోటీల్లో పాల్గొని రెండు గోల్డ్ మెడల్స్, నాలుగు సిల్వర్ మెడల్స్ సాధించారు. గత ఆగస్టులో త్రివేండ్రంలో జరిగిన సౌత్‌జోన్ షూటింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన సన్విత.. త్వరలో జరగబోయే ఆలిండియా షూటింగ్ కాంపిటేషన్‌కు ఎంపికయ్యారు.



మాజీ సీఎం రోశయ్య నుంచి గ్యాలంటరీ అవార్డు అందుకుంటున్న సీఐ నరేష్(ఫైల్)

సంతోషంగా ఉంది

నాకు క్రీడలపై ఆసక్తి ఉంది. నేను 1998లో స్పోర్ట్స్ కోటాలో పోలీసుశాఖలో ఉద్యోగం సంపాదించా. నా కుమార్తె సన్విత్తాషారోన్‌కు షూటింగ్ అంటే మక్కువ. తన కోరిక కాదనకుండా.. శిక్షణ ఇప్పించా. రాష్ట్ర, జోన్ స్థాయిలో ఎన్నో పతకాలు సాధించింది. ఇటీవల త్రివేండ్రంలో జరిగిన షూటింగ్ కాంపిటేషన్‌లో పాల్గొని నేషనల్స్‌కు ఎంపికైంది. ఎంతో సంతోషంగా ఉంది.

– డి.నరేష్ (దిశ పీఎస్ సీఐ)

అంతర్జాతీయ స్థాయికి వెళ్లడమే లక్ష్యం

షూటింగ్ అంటే నాకు ఇష్టం. ఇప్పటి వరకు చాలా కష్టపడ్డాను. నేషనల్స్‌కు ఎంపికయ్యాను. నా తల్లిదండ్రులు, విద్య నేర్పిన గురువుల రుణం తీర్చుకోలేనిది. వారి ప్రోత్సాహం మరువలేనిది. ఎప్పటికైనా దేశం తరపున అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడాలనేది నా కల. అది సాధించి తీరతాను.

– డి.సన్విత్తాషారోన్

పకడ్బందీగా దేవీ శరన్నవరాత్రులు

మంత్రులు కొట్టు సత్యనారాయణ, తానేటి వనిత



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్థానిక ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో వచ్చే నెల 15 నుంచి 23వ తేదీ వరకు జరిగే శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహించి, విజయవంతం చేయాలని అధికారులను దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి తానేటి వనిత ఆదేశించారు. విజయవాడలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో దసరా ఉత్సవాలపై ఆయా శాఖల అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు కొట్టు సత్యనారాయణ, తానేటి వనిత మాట్లాడుతూ.. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలన్నారు. భక్తులకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఘాట్ రోడ్డులో కొండ చరియలు విరిగి పడకుండా ఇప్పటికే దేవస్థానం పటిష్ట చర్యలు తీసుకుందని, అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా అదనంగా జనరేటర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉత్సవాల్లో చిన్నారులు తప్పిపోకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు మాట్లాడుతూ.. దుర్గగుడి అధికారులతో సమన్వయంతో చేసుకుని చిట్ట చివరి భక్తుడి వరకు అమ్మవారి దర్శనం చేసుకునేలా ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు ఉండేలా ఇప్పటికే చర్యలు తీసుకున్నామని తెలిపారు.

తొమ్మిది అలంకారాల్లో దుర్గమ్మ దర్శనం

ఆలయ ఈఓ డి.భ్రమరాంబ మాట్లాడుతూ.. ఈ ఉత్సవాల్లో అమ్మవారు తొమ్మిది అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. తొలి రోజు అక్టోబర్ 15వ తేదీన శ్రీ బాలా త్రిపుర సుందరీదేవి అలంకారంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. అక్టోబర్ 20వ తేదీన మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని సరస్వతీదేవి అలంకారంలో దుర్గమ్మ భక్తులకు దర్శనమిస్తారని తెలిపారు. అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్టువస్త్రాలు సమర్పిస్తారని పేర్కొన్నారు. అక్టోబర్ 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాల్లో నిత్యం సుమారు 50 వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం చేసుకుంటారని, మూలా నక్షత్రం రోజున 1.50 లక్షల నుంచి రెండు లక్షల మంది భక్తులు విచ్చేసే అవకాశం ఉందని వివరించారు.

ప్రత్యేక క్యూలైన్లు

భక్తులకు రూ.100, రూ.300, రూ.500 దర్శనం టికెట్లను ఆన్‌లైన్‌లో జారీ చేస్తామని ఆలయ ఈఓ డి.భ్రమరాంబ తెలిపారు. అక్టోబర్ 15 నుంచి 30 తేదీ వరకు రూ.500 టికెట్‌పై అంతరాలయ దర్శనం ఉండదని స్పష్టంచేశారు.

అర్జీల పరిష్కారం వేగవంతం కావాలి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: స్పందనలో అందిన అర్జీలను నిర్దేశిత సమయంలోగా త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికీ కొన్ని అర్జీలను కారణం లేకుండా పెండింగ్ పెడుతున్నట్లు తెలిసిందని పేర్కొన్నారు. పెండింగ్ ఉంచాల్సి వస్తే సంబంధిత శాఖాధికారికి వివరించాలన్నారు. స్పందనతో పాటు జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలనూ ప్రాధాన్య క్రమంలో త్వరగా పరిష్కరించాలని చెప్పారు. అనంతరం వచ్చిన 223 అర్జీలను కలెక్టర్, డీఆర్వో చంద్రశేఖరరావు, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా అధికారులు పరిశీలించారు.

స్థలాలివ్వండి



సుమారు 70 కుటుంబాల వాళ్లం పదేళ్ల నుంచి నంబూరు సమీపంలోని పెట్రోల్ బంక్ ప్రాంతంలో నివసిస్తున్నాం. అందరం ఎస్టీ కులానికి చెందిన వారం. మా ప్రాంతంలో కరెంట్, మంచినీటి సదుపాయం ఉంది. మేము నివాసమున్న ప్రాంతంలో మాకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పట్టాలివ్వాలని ప్రార్థన.

– ఎస్టీ కాలనీ వాసులు, నంబూరు

• ధనపతిం భజే



రెడ్డినగర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గణపతిని సోమవారం కరెన్సీ నోట్లతో అలంకరించారు. దాదాపు రూ.45 లక్షల విలువైన నోట్లతో కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సుస్మితరెడ్డి దంపతులు గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్కీడ్రాలో విజేతలకు బహుమతులు అందజేశారు.

– నరసరావుపేటరూరల్

సీజనల్ వ్యాధులు ప్రబలనివ్వకండి

- సమన్వయంతో కలసి పనిచేయండి
- కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. సోమ వారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ పారిశుద్ధ్య పనులు చేపట్టడంతోపాటు తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ముఖ్యంగా నీటి పరీక్షలు క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు. నీటి సమస్యలుంటే డయేరియా వ్యాధులు సంక్రమించే అవకాశ ముంటుందన్నారు. ప్రతి 15 రోజులకొకసారి ట్యాంకులను శుభ్రం చేయాలన్నారు. పారిశుద్ధ్య పనులు సరిగ్గా నిర్వహించకపోతే డెంగ్యూ, మలేరియా వ్యాధుల విస్తరణకు దారితీస్తాయన్నారు. ఈ నెల 30న జగనన్న ఆరోగ్య సురక్షా కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రారంభించనున్నారన్నారు. ఇంటింటి సర్వే పూర్తి చేసి చికిత్సలను అందించాలని చెప్పారు. స్కూల్‌కు వెళ్లని పిల్లల్ని ఓపెన్ స్కూల్స్‌లో చేర్పించాలని చెప్పారు. సమావేశంలో డీఆర్వో చంద్రశేఖరరావు, డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, డీఈఓ శైలజ, సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ విజయలక్ష్మి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టుల సేవలు విలువైనవి



గైనకాలజిస్ట్ డాక్టర్ బి.శారదను సన్మానిస్తున్న ఆచార్య బి.కరుణ, ఆచార్య కె.సునీత

ఏఎన్‌యూ: ఫార్మసిస్టుల సేవలు ఎంతో విలువైనవని గైనకాలజిస్ట్ డాక్టర్ డి.శారద అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఫార్మసీ కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవంలో డాక్టర్ శారద ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఫార్మసీ విద్యార్థులతో జరిగిన ప్రసంగ కార్యక్రమంలో 'ఫార్మసిస్ట్ ఇన్ పబ్లిక్ హెల్త్ అండ్ డిజైన్ ప్రివెన్షన్' అనే అంశంపై ఆమె ప్రసంగిస్తూ ఫార్మసిస్టులు సూపర్ హ్యూమన్స్ అన్నారు. నేటి సమాజంలో స్థూలకాయం పలు రకరకాల వ్యాధులకు ప్రధాన కారణమన్నారు. క్రమశిక్షణతో కూడిన జీవనశైలి, వ్యాధి నిరోధక టీకాలు ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడం సులభమని తెలిపారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ మాట్లాడుతూ ఆరోగ్య వ్యవస్థలో ఫార్మసిస్టుల పాత్ర ఎంతో కీలకమన్నారు. కోవిడ్ వ్యాక్సిన్ అభివృద్ధిలో ఫార్మాసిస్టుల పాత్ర ఎంతో కీలకమమన్నారు. ఫార్మసీ విద్యార్థులు సమాజాభివృద్ధే లక్ష్యంగా కృషి చేయాలని సూచించారు. ఓఎస్‌డీ ఆచార్య కె.సునీత, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ప్రమీల రాణి ప్రసంగించారు. 13 సంవత్సరాలుగా ఏఎన్‌యూ ఫార్మసీ కళాశాలలో సేవలు అందిస్తున్న ఫార్మాసిస్టు ఈ పద్మజను అతిథులు సన్మానించారు. ఫార్మసి కళాశాల అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని బయోస్టిమ్‌లెంట్స్ అమ్మకాలు నిలిపివేత



బయోస్టిమ్‌లెంట్స్ డబ్బాలు పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

నగరంపాలెం: గుంటూరు పట్నంబజార్‌లోని ఎంఎస్ వినాయక ఎంటర్‌ప్రైజెస్‌లో సోమవారం గుంటూరు అర్బన్ వ్యవసాయ అధికారులు (1, 2), గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకులు తనిఖీలు నిర్వహించారు. అనుమతుల్లేని సుమారు రూ.10.06 లక్షల బయోస్టిమ్‌లెంట్స్ (289.12 లీ/కిలోలు) అమ్మకాలను నిలుపుదల చేశారు. సృజన లైఫ్ సైన్స్‌స్ (కూకట్‌పల్లి, హైదారబాద్), రియా అగ్రి సైన్స్‌స్ (కూకట్‌పల్లి, హైదరాబాద్), యూనిక్ అగ్రికేర్ (శ్రీవాజీనగర్, హైదారాబాద్), ఆర్ఆర్ బయోలాజికల్స్ (నిజాంపేట, హైదరాబాద్), సుదర్శన్ అగ్రో/బయోకెమికల్స్ (గోరంట్ల, గుంటూరు) కంపెనీలకు జీ2, జీ3 అనుమతుల్లేవని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఆయా కంపెనీలకు బయోస్టిమ్‌లెంట్స్ తయారీకి అవసరమైన అనుమతి పత్రాలు జీ2, జీ3 (జీ3 అక్నాలెజ్‌మెంట్) లేకుండా తయారు చేయడం, విక్రయాలు జరపడంతో సదరు కంపెనీల ఉత్పత్తుల అమ్మకాలను నిలుపుదల చేశామన్నారు. తనిఖీల్లో ఏడీఏ టి.శ్రీనివాసరావు, గుంటూరు అర్బన్ వ్యవసాయ అధికారి-1 బి.అంజిరెడ్డి, గుంటూరు అర్బన్ వ్యవసాయ అధికారి -2 బి.కిషోర్ పాల్గొన్నారు.

విజిలెన్స్ వ్యవసాయ అధికారిగా రమణకుమార్



నగరంపాలెం: రీజినల్ విజిలెన్స్ / ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయ (గుంటూరు) వ్యవసాయ అధికారి (ఏఓ)గా కె. రమణకుమార్ నియమితులయ్యారు. ఫిరంగిపురం మండలం ఏఓగా విధులు నిర్వహిస్తున్న ఆయన విజిలెన్స్ ఏఓగా బదిలీయ్యారు. గతంలో ఇక్కడ ఏఓగా పనిచేసిన జె.వాసంతి ఫిరంగిపురం మండలం ఏఓగా బదిలీ చేశారు. నూతన ఏఓ రమణకుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు కార్యాలయ వర్గాలు పేర్కొన్నాయి.

సీపెట్‌లో ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణ

గుంటూరు ఎడ్యుకేషన్: విజయవాడలోని కేంద్ర పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్)లో ఓబీసీ, ఎస్సీ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనతో కూడిన ఉచిత శిక్షణ కల్పిస్తున్నట్లు సంస్థ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జాతీయ వెనుకబడిన తరగతుల ఆర్థికాభివృద్ధి సంస్థ (ఎన్‌బీసీఎఫ్‌డీసీ), జాతీయ షెడ్యూల్డ్ కులాల ఆర్థికాభివృద్ధి సంస్థ (ఎన్ఎస్ఎఫ్‌డీసీ) సంయుక్తంగా టెస్ట్‌లో ఉత్తీర్ణులైన 18 నుంచి 35 ఏళ్ల లోపు వయస్సు కలిగిన నిరుద్యోగ యువతకు పాలిమర్స్ టెక్నాలజీలో మెషీన్ ఆపరేటర్-ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్, మెషీన్ ఆపరేటర్ అసిస్టెంట్-ప్లాస్టిక్ ప్రాసెసింగ్ కోర్సుల్లో 3-6 నెలల పాటు ఉచిత శిక్షణ కల్పిస్తామని వివరించారు. అనంతపురం, హైదరాబాద్ బెంగుళూరు, హోసూరు, చెన్నై తదితర ప్రాంతాల్లోని ప్రముఖ ప్లాస్టిక్, అనుబంధ సంస్థల్లో ఉద్యోగావకాశాలు చూపిస్తామని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలు, ట్రెనింగ్ కిట్, యూనిఫాం, సేఫ్టీ షూస్‌ను సీపెట్ అందజేస్తుందని వివరించారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ ప్రతినిధి బాణావతు అంజినాయక్‌ను 7893586494 నంబర్లో సంప్రదించాలని తెలిపారు.